దావోస్‌లో జరుగుతున్న డబ్ల్యూఈఎఫ్ సదస్సులో పలువురు కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రాష్ట్రంలో 'యూనిలివర్' పెట్టుబడి

కామారెడ్డిలో పామాయిల్, సీసా మూతల యూనిట్ల ఏర్పాటు
ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ కంపెనీ 'యూనిలివర్' తెలంగాణలో పెట్టుబడి పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. కామారెడ్డిలో పామాయిల్ తయారీ, రిఫైనింగ్ యూనిట్‌తో పాటు బాటిల్ క్యాప్‌ల (సీసా మూతల) తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచ వాణిజ్య వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచ ప్రఖ్యాతి పేరొందిన 'యూనిలివర్' మన దేశంలో హిందుస్థాన్ యూనిలివర్ పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్న విషయం తెలిసిందే. 'యూనిలివర్' గ్లోబల్ సీఈవో హీన్ షూమేకర్‌తోపాటు ఆ కంపెనీ చీఫ్ సప్లైచైన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి జరిపిన చర్చల అనంతరం ఈ ఒప్పందం ఖరారైనట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

స్కైరూట్ రూ.500 కోట్ల పెట్టుబడి

డబ్ల్యూఈఎఫ్ సదస్సులో పాల్గొంటున్న సీఎం రేవంత్‌రెడ్డి బృందం మంగళవారం తెలంగాణ పెవిలియన్‌లో వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ యూనిట్ ఏర్పాటుకు 'స్కైరూట్' కంపెనీ ముందుకొచ్చింది. రూ.500 కోట్ల పెట్టుబడితో ఈ యూనిట్‌ను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నది. సప్లయ్ చైన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్నోవేషన్ రంగాల్లో ఖ్యాతి పొందిన 'ఎజిలిటీ లాజిస్టిక్స్' కంపెనీ వైఎస్ చైర్మన్ తారెక్ సుల్తాన్‌తో రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు భేటీ అయ్యారు.

ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్!

పరిచయం చేసే యోచనలో సెబీ ● గ్రే మార్కెట్ కార్యకలాపాలకు చెక్ పెట్టడానికే

ముంబై, జనవరి 21: గ్రే మార్కెట్ కార్యకలాపాల నిరోధానికి ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్‌ను పరిచయం చేసే యోచనలో మార్కెట్ రెగ్యులేటర్ సెబీ ఉన్నది. ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీవో)లో కేటాయించిన షేర్లను ఇన్వెస్టర్లు వెంటనే అమ్ముకునేలా ఓ వ్యవస్థను తీసుకురావాలనుకుంటున్నట్టు సెబీ చైర్‌పర్సన్ మదాబీ పురీ బచ్ మంగళవారం ఇక్కడ తెలిపారు. తద్వారా గ్రే మార్కెట్ కార్యకలాపాలకు చెక్ పెట్టాలని చూస్తున్నట్టు చెప్పారు. రెండు అగ్రశ్రేణి ప్రాక్సీ అడ్వైజరీ సంస్థలు ఈ పనిలోనే నిమగ్నమయ్యాయని, త్వరలోనే ఓ పోర్టల్ ప్రారంభం కావచ్చన్నారు. సదరు లావాదేవీలన్నీ ఇందులో నిక్షిప్తమవుతాయని, కంపెనీల్లో పాలనాపరమైన ప్రమాణాలను నిర్వహించడంలోనూ ఇది దోహదపడగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

సెబీ ఏం చేప్తున్నదంటే..

ఇటీవలికాలంలో దేశీయ స్టాక్ మార్కెట్లలోకి పెద్ద ఎత్తున ఐపీవోలు వస్తున్న విషయం తెలిసిందే. అలాగే లిస్టింగ్ రోజున భారీ లాభాలనూ నమోదు చేస్తున్న సంగతీ విదితమే. కానీ దీనికి కారణం గ్రే మార్కెట్ కార్యకలాపాలేనని సెబీ అంటున్నది. ఐపీవో ముగిసిన దగ్గర్నుంచి షేర్లు స్టాక్ మార్కెట్లలో నమోదు కావడానికి మధ్య ప్రస్తుతం 3 రోజుల విరామం ఉంటున్నది. ఈ సమయంలో ఇన్వెస్టర్లు, ఆథరైజ్డ్ కాని డీలర్ల నడుమ అనధికార, నియంత్రణలేని క్రయవిక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటినే గ్రే మార్కెట్ కార్యకలాపాలుగా పేర్కొంటున్నారు. అందుకే అనధికారికంగా జరుగుతున్న ఈ లావాదేవీలకు.. మదుపరులు కోరుకుంటే సక్రమ రీతిలో ఎందుకు జరుగడానికి అవకాశం ఇవ్వొద్దని ఆలోచించామని బచ్ చెప్తున్నారు. ఐపీవోలో షేర్ల కేటాయింపు జరిగిందంటే అది లీగలేనని, వాటిని అమ్ముకునే హక్కు కొన్నవారికి ఉంటుందని చెప్పారు. అందులో భాగంగానే ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్‌కు అనుమతిచ్చే దిశగా వెళ్తున్నట్టు తెలిపారు.

మార్కెట్‌కు ట్రంప్ సెగ



నష్టాలకు ప్రధాన కారణాలు

- అమ్మకాల ఒత్తిడిలో మదుపరులు
- వాణిజ్య యుద్ధం దిశగా ట్రంప్ అడుగులు
- అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చిత వాతావరణం
- భారత్ నుంచి తరలిపోతున్న విదేశీ సంస్థాగత పెట్టుబడులు
- డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనం

ముంబై, జనవరి 21: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలకు లోనయ్యాయి. ఉదయం ఆరంభంలో లాభాల్లో కదలాడినా.. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకున్నాయి. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,235.08 పాయింట్లు లేదా 1.60 శాతం కోల్పోయి 75,838.36 వద్ద ముగిసింది. ఒకానొక దశలోనైతే 1,431.57 పాయింట్లు పడిపోయింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ నిఫ్టీ కూడా 320.10 పాయింట్లు లేదా 1.37 శాతం దిగజారి 23,024.65 వద్ద స్థిరపడింది. గత ఏడాది జూన్ 6 తర్వాత ఈ స్థాయికి సూచీ రావడం ఇదే తొలిసారి. కాగా, ఇంట్రా-డేలో నైతే 367.90 పాయింట్లు పతనమైంది.

ఇదీ సంగతి..

అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మళ్లీ వాణిజ్య యుద్ధానికి తెరతీస్తారన్న అంచనాలు మార్కెట్ సెంటిమెంట్‌ను ఒక్కసారిగా దెబ్బతీశాయి. అగ్రరాజ్య రక్షణాత్మక ధోరణులతో ఇతర దేశాల ఆర్థికావకాశాలు క్షీణిస్తాయన్న భయాందోళనలు మదుపరుల్లోనూ చెలరేగాయి. ఫలితంగా స్టాక్ మార్కెట్లలో అలజడి చోటుచేసుకున్నది. నిజానికి ఎన్నికల ప్రచారంలోనే పొరుగు దేశాల నుంచి తమ దేశంలోకి దిగుమతయ్యే వస్తూత్పత్తులపై సుంకాలను 10 నుంచి 20 శాతం విధిస్తామని, చైనా నుంచి వస్తున్నవాటికైతే టారిఫ్‌లు 60 శాతంగా ఉంటాయని ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. గతంలో అధ్యక్షుడిగా ఉన్నప్పుడూ ట్రంప్.. సుంకాల సమరానికి కాలు దువ్విన సంగతి విదితమే. ఈ క్రమంలో ఇప్పుడూ అదే సంకేతాలు వస్తున్నాయి. వచ్చే నెల మొదలు కెనడా, మెక్సికోల నుంచి జరిగే దిగుమతులపై దాదాపు 25 శాతం సుంకాలు విధించే యోచనలో ఉన్నామని ట్రంప్ సోమవారం ప్రకటించారు. ఆ రెండు దేశాల నుంచి అమెరికాలోకి పెద్ద ఎత్తున అక్రమ వలసలు జరుగుతున్నాయని, నార్కోటిక్స్ వస్తున్నాయని ట్రంప్ ఆరోపిస్తున్నారు. వీటిని అరికట్టేందుకే సుంకాలను పెంచాలని చూస్తున్నట్టు చెప్పారు. ముమ్ముందు ఇతర దేశాలపైనా ట్రంప్ ఇదే దుందుడుకు వైఖరి ఉంటుందన్న అంచనాలొస్తున్నాయి.

రంగాలవారీగా..

రియల్టీ రంగ షేర్లు గరిష్ఠంగా 4.22 శాతం నష్టపోయాయి. కన్జ్యూమర్ డ్యూరబుల్స్ 3.99 శాతం, సర్వీసెస్ 2.86 శాతం, పవర్ 2.63 శాతం, టెలికం 2.52 శాతం చొప్పున తగ్గాయి. జొమాటో షేర్ విలువ అత్యధికంగా 10.92 శాతం పడిపోగా.. ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ, రిలయన్స్ ఇండస్ట్రీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ షేర్లూ పతనమయ్యాయి. ఇక ఆసియా మార్కెట్లలో జపాన్, హాంకాంగ్ సూచీలు లాభపడగా.. చైనా, దక్షిణ కొరియా ఇండెక్స్‌లు నష్టపోయాయి. కాగా, విదేశీ సంస్థాగత మదుపరులు ఒక్కరోజే రూ.5,920 కోట్ల పెట్టుబడుల్ని వెనక్కి తీసుకున్నట్టు స్టాక్ ఎక్స్చేంజ్ గణాంకాలు చెప్తున్నాయి.

మార్కెట్ విలువ డౌన్

స్టాక్ మార్కెట్ల భారీ నష్టాలతో ఆయా కంపెనీల మార్కెట్ విలువ కూడా అదే రీతిలో క్షీణించింది. ఈ ఒక్కరోజే మదుపరుల సంపద ట్రిలియన్ డాలర్లకు పరిమితమైంది. బీఎస్ఈలో మొత్తం 4,088 షేర్లు ట్రేడ్ అవగా, 2,881 షేర్లు నష్టపోయాయి. మిడ్ క్యాప్ 2 శాతం, స్మాల్ క్యాప్ 1.94 శాతం చొప్పున నిరాశపర్చాయి.

రూ.7.52 లక్షల కోట్లు ఆవిరైపోయింది. బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ. 7,52,520.34 కోట్లు తరిగిపోయి రూ.4,24,07, 205.81 కోట్లు లేదా 4.90

బ్రాండ్లలో మేటి.. భారతీయ ఐటీ

అత్యంత విలువైన సంస్థల్లో టీసీఎస్, ఇన్ఫీ, హెచ్‌సీఎల్ బ్రాండ్ ఫైనాన్స్ తాజా నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ, జనవరి 21: దేశీయ ఐటీ దిగ్గజాలు అంతర్జాతీయ స్థాయిలో మరోసారి సత్తాచాటాయి. ప్రపంచవ్యాప్తంగా అత్యంత విలువైన సంస్థల జాబితాలో ఐదు సంస్థలు చోటు దక్కించుకున్నాయి. వీటిలో టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, టెక్ మహీంద్రాలు ఉన్నాయని బ్రాండ్ ఫైనాన్స్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అంతర్జాతీయంగా టాప్-10 విలువైన సంస్థల్లో అమెరికా ఎప్పటిలాగే 40 శాతంతో తొలిస్థానంలో నిలిచింది. 36 శాతం వాటాతో భారత్ ఆ తర్వాతి స్థానంలో నిలిచినట్లు వెల్లడించింది. యూఎస్ టెక్నాలజీ దిగ్గజం యాక్సెంచర్ వరుసగా ఏడోసారి అత్యంత విలువైన సంస్థగా తన స్థానాన్ని కొనసాగించింది. దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 21.3 బిలియన్ డాలర్ల బ్రాండ్ విలువ(11 శాతం ఎగబాకింది)తో రెండో స్థానం దక్కించుకున్నది. వరుసగా నాలుగోసారి ఈ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. మరోవైపు, 2025లో అత్యంతవేగవంతమైన ఐటీ సర్వీసుల బ్రాండ్‌గా హెచ్‌సీఎల్ టెక్నాలజీ అవతరించిందని పేర్కొంది. గడిచిన ఐదేండ్లుగా తొలిస్థానంలో ఉన్న ఇన్ఫోసిస్‌ను వెనక్కినెట్టి హెచ్‌సీఎల్ ఈ స్థానాన్ని దక్కించుకున్నదని బ్రాండ్ ఫైనాన్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. మొత్తం ఐటీ విలువల్లో 36 శాతం వాటాతో భారత్ రెండోస్థానంలో కొనసాగుతున్నది. గత కొన్నేండ్లుగా నిరాశాజనక పనితీరు కనబరిచిన అమెరికా మార్కెట్ తిరిగి పుంజుకోవడం దేశీయ ఐటీ సంస్థలకు కలిసొచ్చిందని, ముఖ్యంగా నూతన ఆర్డర్లు రావడంతో దేశీయ ఐటీ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంది. మూడోస్థానంలో నిలిచిన ఇన్ఫోసిస్ బ్రాండ్ విలువ 15 శాతం ఎగబాకి 16.3 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. ఇదే స్థానంలో కొనసాగడం వరుసగా నాలుగోసారి. ఇన్ఫోసిస్ సీఈవో పరేఖ్ నాయకత్వంలో సంస్థ అన్ని విభాగాల్లో రాణిస్తున్నదని, పనితీరు మెరుగుపడటంతోపాటు ఇన్నోవేషన్‌లో దూసుకుపోతున్నదని పేర్కొంది. అలాగే హెచ్‌సీఎల్ టెక్నాలజీ బ్రాండ్ విలువ 17 శాతం ఎగబాకి 8.9 బిలియన్ డాలర్లకు చేరుకోగా, విప్రో విలువ 6 బిలియన్ డాలర్లుకాగా, టెక్ మహీంద్రా కూడా టాప్-10లో చోటు దక్కించుకున్నాయి. అలాగే టాప్-25 గ్లోబల్ ర్యాంకింగ్ సంస్థల్లో తొలిసారిగా హెక్సావేర్ టెక్నాలజీ ప్రవేశించింది.

హెచ్‌సీఎల్ టెక్ విస్తరణ

హైదరాబాద్, జనవరి 21: హెచ్‌సీఎల్ టెక్నాలజీ..హైదరాబాద్‌లో నూతన సెంటర్‌ను ప్రారంభించింది. అంతర్జాతీయ క్లయింట్లకు కృత్రిమ మేధస్సు, డిజిటల్ ట్రాన్స్‌మిషన్ సొల్యూషన్స్ సేవలు అందించాలనే ఉద్దేశంతో నగరంలో కొత్తగా సెంటర్‌ను ఆరంభించినట్లు కంపెనీ సీఈవో, ఎండీ సీ విజయకుమార్ తెలిపారు. హై-టెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 5 వేల మంది కూర్చోవడానికి వీలుంటుందన్నారు.

విప్రో కన్జ్యూమర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్

హైదరాబాద్, జనవరి 21: విప్రో అనుబంధ సంస్థయైన విప్రో కన్జ్యూమర్ కేర్ అండ్ లైటింగ్ సంస్థ..హైదరాబాద్‌లో ఐవోటీ ఆధారిత ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. రాష్ట్రంలో అత్యాధునిక లైటింగ్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ సెంటర్‌ను నెలకొల్పినట్లు, దేశంలో ఇది రెండో సెంటర్‌ని కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ అనూజ్ ధీర్ తెలిపారు.

గణపురం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ములుగు రూరల్ : మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

పేదలకు పథకాలు అందేలా చూడాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ

గణపురం/ చిట్యాల/ రేగొండ/ మహాముత్తారం/ మల్హర్, జనవరి 21: పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులకు సూచించారు. మంగళవారం వారు గణపురం మండలం కర్కపల్లి, చిట్యాల మండలం, గోరికొత్తపల్లి మండలం సుల్తాన్‌పురం, రేగొండ మండలం రామన్నగూడెం తండాలో నిర్వహించిన గ్రామ సభలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేశారని, ఆ జాబితాను ఫైనల్ చేసేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రజల సమక్షంలో ఎంపికలు చేస్తున్నట్లు చెప్పారు. పథకాల అమలులో భాగంగా 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభల్లో గ్రామస్తులను, ఇందిరమ్మ కమిటీలను భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. జాబితాలో పేర్లు రాని గ్రామ సభల్లో కానీ, ఎంపీడీవో కార్యాలయంలో కానీ దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. అదనకు కలెక్టర్ విజయ లక్ష్మి, గణపురం మండల ప్రత్యేకాధికారి కుమారస్వామి, తహసీల్దార్ మధురకవి సత్యనారాయణస్వామి, ఎంపీడీవో భాస్కర్, చిట్యాల ఎంపీడీవో జయశ్రీ, తహసీల్దార్ హేమ, చిట్యాల ఏఎంసీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, ఎంపీవో రామకృష్ణ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు,రేగొండ ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్లు వీరభద్రం, స్వేత, ఎంపీవో రాంప్రసాద్, వ్యవసాయ అధికారులు సారయ్య, వాసుదేవారెడ్డి, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుంటోజు కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి విజ్జన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య పాల్గొన్నారు. మహాముత్తారం మండలం బోర్లగూడెం, కనుకనూర్, గండి కామారం, మహబూబ్‌పల్లి, కొర్లకుంట, మాదారం గ్రామాల్లో అధికారులు సభలు నిర్వహించారు. మాదారం గ్రామ సభకు సబ్ కలెక్టర్ మయాంక్ హాజరై మాట్లాడారు. సంక్షేమ పథకాలు అమలుకు అధికారులందరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు. అలాగే మల్హర్ మండలందుబ్బపేట, ఆడ్వాలపల్లి, చిన్న తూండ్ల గ్రామాల్లో సభలు నిర్వహించగా ఆడ్వాలపల్లిలో సబ్‌కలెక్టర్ మయాంక్ పాల్గొనగా అర్హుల లిస్టులో పేరు రాని వారు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్యామ్‌సుందర్, తహసీల్దార్ రవికుమార్, మాజీ ఎంపీపీ మలహల్‌రావు, ఏపీవో హరీశ్ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ములుగు కలెక్టర్

ములుగురూరల్/ వెంకటాపూర్/ తాడ్వాయి/ గోవిందరావుపేట: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. మంగళవారం ములుగు మండలం జీవంతరావుపల్లి గ్రామ సభను కలెక్టర్ సందర్శించి మాట్లాడారు. అధికారులు నిజమైన లబ్ధిదారులను గుర్తించడానికి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. సాగు భూమి, రేషన్ కార్డులు, ఇండ్లు లేని పేదలు పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇచ్చిన ప్రతీ దరఖాస్తును తప్పని సరిగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. అలాగే జీంతరావుపల్లి గ్రామంతో పాటు అబ్బాపురం, అంకన్నగూడెం, బరిగలాని పల్లి, దేవగిరిపట్నం, కన్నాయిగూడెం, కాసిందేవిపేట, కొడిశలకుంట గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. తహసీల్దార్ విజయ్‌భాస్కర్, ఎంపీఎం మహబూబ్‌పాషా, ఎంపీడీవో రామకృష్ణ, సీడీపీవో శిరీష, డిప్యూటీ ఈఈ లింగారెడ్డి, ఆర్ఐ యుగేంధర్, ఎంఎస్‌పో కొమురయ్య ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వెంకటాపూర్ మండలం ఎల్లారెడ్డిపల్లి, రామంజాపూర్, నర్సింగాపూర్, తిమ్మాపూర్, అడవిరంగాపూర్, సింగరకుంటపల్లి గ్రామాల్లో 595 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 119, రైతు భరోసాకు 10, రేషన్ కార్డుల కోసం 252, ఇందిరమ్మ ఇళ్లకోసం 214 దరఖాస్తులు వచ్చాయన్నారు. తహసీల్దార్ గిరిబాబు, ఎంపీడీవో రాజు, ఎస్సై సతీశ్, ఏపీవో సునీత, ఏపీఎం రవి, ఏవో శైలజ పాల్గొన్నారు. తాడ్వాయి మండలం మేడారంలో ఎంపీవో శ్రీధర్, కామారం(పీటీ)లో డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌బాబు, అంకంపల్లిలో ఏపీవో అనిల్, పంబాపురంలో ఏటీఎం శ్రీనివాస్ దరఖాస్తులు స్వీకరించారు. గోవిందరావుపేట మండలం బాలాజీనగర్, పాపయ్యపల్లి, గాంధీనగర్, రాంనగర్ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎక్కువగా ఇందిరమ్మ గృహాల కోసమే ప్రజలు పోటీ పడి దరఖాస్తులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సృజన్‌కుమార్, ఎంపీడీవో జవహర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి జితేందర్‌రెడ్డి, ఆర్ఐ రాజేందర్, సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన

వెంకటాపూర్, జనవరి 21 : మండలకేంద్రంలోని వేదవ్యాస ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని హెచ్ఎం పోశాల వీరమల్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం మాట్లడుతూ స్వయం పరిపాలన అంటే కేవలం పాలన విధానం కాదని, ప్రజాస్వామ్యానికి, నాయకత్వ స్ఫూర్తికి పునాది అని, సమష్టి అభివృద్ధికి నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలను నేర్పుతుందన్నారు. కార్యక్రమంలో ఒక రోజు హెచ్ఎంగా ఎండీ అమీనా, కరస్పాండెంట్‌గా సిరిచందన, ఎంఈవోగా మనోహర్, పీఈటీలుగా నవీన్, కార్తీక్, రామ్‌చరణ్, ఉపాధ్యాయులుగా శావ్య, షణ్ముఖశ్రీ, బిందు, పవన్ తేజ మనోహర్, హర్షిత, వంశీ వ్యవహరించారు. పాఠశాల యాజమాన్యం సూర్యప్రకాష్‌రెడ్డి, రాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూరారంలో..

మహదేవపూర్ : మండలంలోని సూరారం ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు పాఠాలను భోధించారు. ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రవీందర్ అభినందించారు.

ట్రాక్టర్ ఢీకొని పంచాయతీ కార్యదర్శి మృతి

రేగొండ, జనవరి 21 : ట్రాక్టర్ ఢీకొని పంచాయతీ కార్యదర్శి మృతి చెందాడు. ఈ ఘటన మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన కటకం రమేశ్ ఇంటి నిర్మాణానికి మొరం పోసిన ట్రాక్టర్ రాంగు రూట్‌లో వస్తుండగా, ఇదే మండలం నారాయణపురం పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న చంద్రారెడ్డి విధులు ముగించుకొని స్వగ్రామమైన తిరుమలగిరి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ ఢీకొనడంతో చంద్రారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీస్ వాహనంలో పరకాల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఇంగ్లిష్‌లో జిల్లా స్థాయి బహుమతి

ఏటూరునాగారం, జనవరి 21 : రామన్నగూడెం జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థిని జిల్లా స్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్, ఉపన్యాస పోటీల్లో కే సుష్మ ద్వితీయ స్థానం సాధించినట్లు హెచ్ఎం కొయ్యడ మల్లయ్య తెలిపారు. ఎల్లా ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోషియేషన్ ములుగు జిల్లా ఆధ్వర్యంలో ఈ పోటీలను చేపట్టగా ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు.

గాయపడిన మహిళ మృతి

వాజేడు, జనవరి 21 : మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన వాసం నాగలక్ష్మి ఈనెల 19న బైక్ పైనుంచి కిందపడి గాయపడింది. ఆమెను కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా తలకు బలమైన గాయమై బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టడంతో వైద్యులు ఆపరేషన్ చేయాలని చెప్పారు. ప్రయివేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు

ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

మంగపేట, జనవరి 21 : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీలను డీఎంహెచ్‌వో గోపాల్‌రావు మంగళవారం తనిఖీ చేశారు. ఈ మేరకు దవాఖాన రికార్డులతో పాటు పరిసరాలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది రోగులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, మందుల కొరత లేకుండా చూసుకోవాలని అన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్, జిల్లా క్షయ వ్యాధి ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రకాంత్, ఐటీడీఏ ప్రోగ్రామ్ మేనేజర్ మహేందర్, వైద్యులు గౌతమ్, యమన, తరుణ్, మనోజ్, అపూర్వ ఉన్నారు.

ఆశ వర్కర్ల ర్యాలీ

భూపాలపల్లి రూరల్, జనవరి 21 : తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరుతూ మంగళవారం జిల్లా కేంద్రంలోని హనుమాన్ దేవాలయం నుంచి కలెక్టరేట్ వరకు ఆశ వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి నెలా రూ.18 వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ర్యాలీకి సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. స్వప్న, సునీత, రాజేశ్వరి, మంజూల, రాధిక పాల్గొన్నారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తిపై కేసు

వాజేడు, జనవరి 21 : అక్రమంగా గుడుంబా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనంప్రకారం.. చెరుకురు, రేగూలపాడు గ్రామాల్లో మంగళవారం తనిఖీలు చేస్తుండగా కన్నెబోయిన కాటం రాజు ఇంటి వద్ద గుడుంబా అమ్ముతుండగా పట్టుకున్నట్లు చెప్పారు. అతని వద్ద 200 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో ఏఎస్సై లతీఫ్, హెడ్ కానిస్టేబుళ్లు హరిప్రసాద్, తిరుపతి, కానిస్టేబుళ్లు నాగార్జున, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, హోంగార్డు పొలిశెట్టి గోవింద్, నర్సయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

వెంకటాపురం(నూగూరు), జనవరి 21 : మండలకేంద్రంతో పాటు ఆలుబాక, వీఆర్‌కేపురం, ఎదిర, రాచపల్లి గ్రామాల్లో ఎందిర పీహెచ్‌సీ ఆధ్